# నూతలపాడు

## చిమట శ్రీనివాస రావు






మన జన్మభూమి... బంగారు భూమి
పాడిపంటలతో, పసిడిరాసులతో..
కళకళలాడే జనని..

చిత్రం: పాడిపంటలు (1976); సంగీతం:కె.వి. మహాదేవన్
Source: http://www.ChimataMusic.com/solo_krishna.php

మా ఊరు... తలచుకుంటేనే మనసంతా అవ్యక్తమైన ఆనందానుభూతులతో నిండిపోతుంది. మా ఊరిని తలచుకోవటమంటే నా బాల్యాన్ని నేను అద్దంలో చూసుకున్నట్టే. నా చిన్నప్పటి విషయాలు, బాల్య స్నేహితులు, బంధువులు, ఊళ్ళో జనాలు, పాఠశాలలు, సినిమా హాలు, చుట్టుపక్కల ఊళ్ళు అన్నీ ఒక్కొక్కటిగా నా కళ్ళ ముందుకి వస్తాయి... మా ఊరు ప్రకాశం / గుంటూరు జిల్లాల సరిహద్దులో ఉన్న పర్చూరుకి 5 కిలోమీటర్ల దూరంలో వున్న నూతలపాడు... ప్రకాశం జిల్లాలో ఇంకో రెండు, మూడు నూతలపాళ్ళు ఉండటం వల్ల మాఊరుని 'చీరాల దగ్గర నూతలపాడు ' అని అంటారు. ఊళ్ళో పదివేలకు పైగా జనాభా ఉంటారు. మా ఊరు చుట్టుపక్కల దాదాపు పది కుగ్రామాలకి మంచి సెంటరు. గుంటూరు, చీరాల, పర్చూరు, ఇంకొల్లు నుండి దాదాపు ప్రతి గంటకు ఒక బస్సు ఉంటుంది. బాగా రాజకీయచైతన్యం ఉన్న ఊరు కావడంతో పర్చూరు నియోజక వర్గంలో మా ఊరుకి ఒక విశిష్ట స్థానం ఉంది. 3,4 ఎలిమెంటరీ స్కూళ్ళు, ఒక జూనియర్ కాలేజి ఉన్నా, హైస్కూలుకి మాత్రం పక్కనే ఉన్న పూసపాడుకి వెళ్ళాలి. ఊరి సెంటరులో శ్రీలక్ష్మి థియేటరు అని ఒక మంచి సినిమాహాల్ ఉంది.

నేను అచ్చమైన రైతు కుటుంబంలో పుట్టినా, చిన్నప్పటినుంచి పొలం పనులేమీ చేయకుండా సుకుమారంగా పెరిగినట్టే లెక్క. అప్పుడప్పుడు మా ఇంటి (Fremont, CA) backyard లో నా పనితనం చూసి మా ఆవిడ అసలు నేను రైతు కుటుంబం నుండే వచ్చానా అని విస్మయం వెలిబుచ్చుతూ వుంటుంది!

నేను దాదాపు నా రెండోయేట నుండి ఆరు, ఏడు యేళ్ళ వరకు మా పెదనాన్న, ఆమ్మ (గుంటూరు మాండలీకంలో పెద్దమ్మని ఆమ్మ అంటారు) దగ్గర పెరిగాను. వాళ్ళకు అబ్బాయిలు లేకపోవడం వల్ల నన్ను చాలా గారాబంగా పెంచారు. మా పెదనాన్న భుజాల మీద ఎక్కి పొలానికి, పశువుల కొట్టంకి వెళ్ళడం నాకు ఇప్పటికీ గుర్తుంది. మా పెదనాన్న మా ఎద్దులకు పట్టెడలు, చిక్కంలు బిగిస్తుంటే నేను దగ్గరలో ఉన్న నులకమంచం మీద కూర్చొని చూడటం.. తరువాత నన్ను వళ్ళో కూర్చోపెట్టుకొని ఆయన మా ఎద్దుల బండిని తోలడం.. మా పెదనాన్న అరక దున్నుతుంటే నేను జమ్మిచెట్టు కింద ఆడుకోవడం.. మధ్యాహ్నం మా ఆమ్మ పొలానికి తెచ్చిన అన్నాన్ని ఒక కుంట పక్కన కూర్చుని అందరం కలిసి తినడం..
అన్నీ ఇంకా కళ్ళ ముందు సజీవంగా మెదులుతున్నాయి.. జ్ఞాపకాల ఉనికి ఇంకా గుండెల్లో వెచ్చగా కదులుతూ అప్పుడప్పుడు నా కళ్ళను చెమరుస్తూ వుంటుంది.

నేను పుట్టడం నూతలపాడులో అయినా, మా అమ్మా నాన్నలు పక్కనే ఉన్న చింతగుంటపాలెం లో ఉండటం వల్ల 5వ తరగతి వరకు అక్కడే చదివాను. అసలు మా "చిమట"

వాళ్ళ రూట్స్ చింతగుంటపాలెం నుంచేనని మా నాన్న అంటుండేవాడు. చింతగుంటపాలెం అనగానే ముందుగా నాకు గుర్తుకు వచ్చేవి:

మా అక్క, మా తమ్ముడితో కలబోసిన నా బాల్యం.. మా కజిన్ లు (ముఖ్యంగా మా వెంకటేశ్వరరావు అన్నాయి)..

నూతలపాడు / పూనూరు/ వంకాయలపాడు / పూసపాడు సినిమా హాళ్ళలో ఈ ఊరినుండి వెళ్ళి చూసిన సినిమాలు..

ఊరి చెరువు, దానికి ఆనుకున్న పెద్ద కట్ట, కట్ట మీద ఉన్న పెద్ద చింతచెట్టు .. మూడు దేవాలయాలు, వాటి అరుగు బండలు, వాటి మీద కూర్చొని ఊరిజనం చేసే కాలక్షేపం, ముఖ్యంగా బ్రహ్మం గారి గుడిమీద మేమంతా ఆడే పులి-మేక, చదరంగం ఆటలు.. ఎలిమెంటరి స్కూళ్ళు (పాతది, కొత్తది)..

నా స్నేహితులు (ముఖ్యంగా భవనం చెంచిరెడ్డి).. గుంటూరు నుండి రోజుకు 4, 5 సార్లు పూనూరుకి వచ్చే బస్సు (ఈ బస్సు ఒక్కటే ఈ ఊరిని నూతలపాడుకి, పర్చూరుకి కలిపేది).. ప్రత్తి పొలాలు,ఎర్ర తివాచీ పరిచినట్లుండే మిరప తోటలు.. మా ఊరివాళ్ళు ప్రతి ఏడాది వేసే బ్రహ్మంగారి నాటకం.. చెరువుకట్ట పక్కనే ఉన్న మా బసవయ్య పెదనాన్న వాళ్ళ గోడమీద సినిమా వాలుపోస్టర్లు.. పాలెం నుండి పొలాల మీదగా (బస్సు రోడ్డు మీద కాకుండా) గట్లు లెక్కపెట్టుకుంటూ మా నూతలపాటి ఇంటికి వెళ్ళడం..ఊరికి పక్కనే ఆనుకొనిఉన్న పొలాల్లో (ఎండాకాలంలో) ఆడిన కబడ్డీ, వాలీబాల్ ఆటలు.. మంచినీళ్ళ గిలకల పెద్దబావి, వగైరా వగైరా..

మొట్టమొదటిసారి పిల్లల పుస్తకం ‘చందమామ ‘ చదవటం ఇంకా గుర్తుంది.. అప్పుడు నేను రెండో తరగతిలో వున్నాను.. పూనూరు హైస్కూలులో డ్రిల్లు మాస్టారుగా పనిచేసిన పందిళ్ళపల్లి శ్రీనివాసరావు గారి దగ్గరకు ప్రైవేటుకి మా అక్కవాళ్ళు వెళుతుంటే నేనుకూడా వెళ్ళేవాడిని. వాళ్ళ ఇంట్లోనే చందమామ, బొమ్మరిల్లు లాంటి పుస్తకాలు చూశాను. నేను, చెంచి రెడ్డి కలిసి నారమ్మగారి అరుగుమీద, ఇంకా కట్ట మీద ఉన్న రెండు గుళ్ళ అరుగు బండల మీద నాలుగు, అయిదు తరగతుల నుండే చాల పుస్తకాలు చదివేవాళ్ళం. చెంచిరెడ్డి వాళ్ళ అమ్మ వారపత్రికలు చదువుతుంటే, మేమిద్దరం కూడా వాళ్ళ ఇంట్లో కూర్చొని అవి చదివేవాళ్ళం (ఆవిడ పెట్టే కారప్పూస, కారపుచెక్కలు తింటూ). తరువాత నేను ఇంటరు, ఇంజినీరింగ్ రోజుల్లో సెలవల్లో ఇంటికి వచ్చినప్పుడు, మా అమ్మ చుట్టుపక్కల వాళ్ళ నుండి నవలలు, వారపత్రికలు నాకోసం తీసుకొచ్చేది.

మా అమ్మకున్న సినిమా అభిమానం (మానాన్న దృష్టి లో పిచ్చి) మా ఇంటిలో నాకు ఒక్కడికే వచ్చింది. నాకు ఊహ తెలిసినప్పటినుండే ఇంట్లో ఆడవాళ్ళతో (మా అమ్మ, నాయనమ్మ, అమ్మ, అక్కలు), మా కజిన్ లు, స్నేహితులతో ఇలా ఎప్పుడు అవకాశం దొరికినా సినిమాలు విరివిగా చూసేవాడిని. ఇప్పటికి కూడా నాకు ఏ సినిమా ఏ ఊళ్ళో, ఏ థియేటరులో చూశానో మెదడులో అచ్చు వేసినట్లు ఇంకా



సినిమాహాలు

గుర్తుంది. నేను 6,7 తరగతులు నూతలపాడు లోను.. 8,9,10 తరగతులు పక్కనే ఉన్న పూసపాడు లోను చదివాను. ఈ అయిదు సంవత్సరాలలో నా సినిమా పిచ్చి ఇంకాస్త పెరిగిందనే చెప్పాలి. నేను, మా తమ్ముడు (చిట్టిబాబు), మా కజిన్ లు (విన్నకోట రవి, విన్నకోట శ్రీను) తో కలిసి మా ఊళ్ళోనే కాక చుట్టుపక్కల ఊళ్ళలో డుతున్న సినిమాలను సైకిళ్ళ మీద మైళ్ళ దూరం వెళ్ళి మరీ చూసేవాళ్ళం. ముఖ్యంగా ఎన్టీఆర్ నటించిన జానపద,పౌరాణిక సినిమాలు, కృష్ణ "దొంగ" సీరీస్,

Bond Style సినిమాలు, శోభన్‌బాబు, చిరంజీవి Action సినిమాలు మా ఊరి చుట్టుపక్కల ఎక్కడికొచ్చినా మేమందరం తప్పకుండా చూసేవాళ్ళం. ఎప్పుడన్నా పర్చూరు, చీరాల, చిలకలూరిపేట కు బస్సులో వెళ్ళుతున్నప్పుడు దారి మధ్యలో ఎన్టీఆర్ కత్తి పట్టుకున్న వాలుపోస్టర్లు చూస్తే, అక్కడికక్కడ బస్సు దిగి అర్జంటుగా సినిమా చూడాలని మనసు ఉవ్విళ్ళూరేది.


పోలేరమ్మ గుడి

మా ఊరు నూతలపాడు అనగానే చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళకి మొట్టమొదటిగా గుర్తుకువచ్చేది మా ఊళ్ళో యేటా మే, జూన్ లలో జరిగే "పోలేరమ్మ తిరునాళ్ళు". గుంటూరు / ప్రకాశం జిల్లాలలో కోటప్పకొండ, మంగళగిరి, కొండపాటూరు, సింగరకొండ తిరునాళ్ళ తరువాత మా ఊరిలో జరిగే తిరునాళ్ళే బాగా ప్రసిద్ధి చెందింది. తిరునాళ్ళ రోజు నాటి సందడిని తలచుకుంటే మనసు ఇప్పటికీ ఆనందంతో ఉరకలు వేస్తుంది. సర్కసువాళ్ళు తెచ్చే పులులు, సింహాలు, ఏనుగులు; మా ఊరివారు కట్టే మూడు పెద్ద యెలక్ట్రిక్ ప్రభలు, చుట్టుపక్కలనుండి వచ్చే లెక్కలేనన్ని చిన్న, చిన్న ప్రభలు; మాఊరి సినిమా థియేటర్లో రోజంతా వేసే సినిమాలు; అడవి రాముడు, వేటగాడు, డ్రైవర్ రాముడు,గజదొంగ లాంటి సినిమాల్లోని మాస్ పాటలతో ఊరంతా హోరెత్తించే పెద్ద పెద్ద మైకులు; పెద్ద ప్రభలమీద చిలకలూరిపేట, నరసారావుపేట నుండి వచ్చే రికార్డు డ్యాన్సర్లు వేసే డ్యాన్సులు; మా ప్రభకు మా చుట్టాల (కంభంపాటి శ్రీను వాళ్ళ) ఇంటిలో పిల్లలందరం కలిసి ప్రభను ముస్తాబు చెయ్యడానికి మేము కత్తిరించే రంగు కాగితాలు, మైదా పిండి డబ్బాల వాసనలు; పండగరోజు పోలేరమ్మగుడి చుట్టూ తిప్పటానికి మా ఊరు, చుట్టుపక్కల ఊళ్ళనుండి తోలుకొచ్చిన గేదెలు; తిరణాల స్థలంలో రంగుల రాట్నాలు, పావలాకు దొరికే సినిమాపాటల పుస్తకాలు, చిన్న పిల్లలని నెత్తిన ఎక్కించుకొని ఒకచేత్తో భుజంపై పెద్ద పెద్ద చెరకుగడలను పెట్టుకొని, రెండో చేత్తో ఒక సంచిని పట్టుకొని తిరిగే జనాలు.. ఇలా ఎన్నెన్నో మధురానుభూతులు కళ్ళముందే కదలాడుతుంటాయి.

నూతలపాడులోని ఇంకో విశేషమేమిటంటే దాదాపుగా గత 50 సంవత్సరాలుగాఉన్న రెండు పెద్ద దేవాలయాలు (శివాలయం, రామాలయం). వినాయకచవితి పండగ రేపనంగా, ముందురోజు రాత్రి పిల్లలందరం కలిసి పొలాల మీద పడి రకరకాల చెట్ల ఆకులను, ఈరెండు గుళ్ళలో ఉన్న చెట్ల ఆకులను పూజకు కావలసిన "పత్రి" గా సేకరించి, తెల్లారగానే ఒక ఘనకార్యం చేసిన ఫీలింగుతో ఇంటికి చేరుకొనేవాళ్ళం. పండగరోజు మేము మట్టితో చేసిన చిన్న చిన్న వినాయక విగ్రహాలను మా ఊరి చెరువులో వదిలేవాళ్ళం. మా తమ్ముడు చిట్టిబాబు వినాయకుడి బొమ్మలని బాగా చేస్తాడని అందరూ అంటారు. రామాలయం పూజారిగారి ఆఖరి అబ్బాయి నారాయణాచార్యులు నాకు 8వ తరగతినుండి పరిచయం అయ్యిన ప్రాణ మిత్రుడు. నేను సెలవల్లో (ఇంటరు, ఇంజినీరింగు రోజుల్లో) ఇంటికి వచ్చినప్పుడు నేను, నారాయణ కలిసి మా 10వ తరగతి గ్రూపు ఫోటోను రామాలయం అరుగులమీద కూర్చుని తనివితీరా చూసుకొనేవాళ్ళం. అలాగే నేను సెలవల్లో ఇంటికి వచ్చినప్పుడు నేను మా కజిన్ల తో సాయంత్రం పూట మా చెరువుకట్ట మీద కూర్చుంటే, వాళ్ళు ఊళ్ళో జరిగే విశేషాలు, గాసిప్పులతో నాకు update ఇచ్చేవాళ్ళు. తర్వాత బాగాచీకటి పడ్డాక

అందరం కలిసి నైటు సెకండ్ షో సినిమాకు వెళ్ళేవాళ్ళం. అప్పుడప్పుడూ మిలిటరీ నుండి వచ్చే మా కజిన్ కంభంపాటి శ్రీను కోసం మేమంతా ఎదురుచూసేవాళ్ళం (ఎప్పుడన్నా మాఇద్దరికీ ఒకేసారి శెలవలు వచ్చినప్పుడు). శీను మాముందు బ్యాచ్ లో 10వ తరగతి స్కూల్ first. కాని ఆర్థిక ఇబ్బందులవల్ల ఇంటరు అయిపోయిన వెంటనే మిలిటరీ లో చేరాడు. శ్రీనుని తలుచుకొన్నప్పుడు ఆర్మీలో అతని ఉన్నతికి సంతోషం, మంచి ఇంజినీరు అయ్యే అవకాశం అతను కోల్పోయినందుకు బాధ కలుగుతాయి. నాకన్నా పెద్దవాళ్ళయిన మా కజిన్ లు విన్నకోట చిన్నవీరయ్య, ముంగెర శ్రీను, మా చిన్న బాబాయి ఆంజనేయులు తో సినిమా చర్చలు జరిపి వాళ్ళ స్కూల్ రోజుల్లో సినిమా సంగతులను ఆసక్తిగా వినేవాణ్ణి.

మాఊరు అంటే ఇంకొన్ని జ్ఞాపకాలు కళ్ళముందు కదలాడుతున్నాయి. వేసవి సెలవల్లో మేము జాగర్లమూడికి వెళ్ళే దారిలో ఉన్న మూడు పెద్ద చింత చెట్ల మీద ఎక్కి బాగా ఆడుకొనేవాళ్ళం. నేను ఒక మోస్తారుగా పాకేవాణ్ణిగాని, కొంతమంది చిచ్చర పిడుగులు చివర కొమ్మల దాక పాకి అక్కడనుండి కిందకు దూకేవారు. చెట్టు కింద బొంగరాల ఆట, బచ్చాలాట, గోలీలాట ఆడుకుంటూ మాటినీ షో ప్రచారం చేసే రిక్షా కోసం (ఊరి మొత్తమే కాకుండా, దగ్గరలో ఉన్న పొలాల వరకు ప్రచారం మైకు వినపడేది) నిరీక్షించేవాళ్ళం. మైకు అంటే గుర్తుకొచ్చింది.. ఏదన్నా చుట్టాల




పెళ్ళి జరుగుతున్నప్పుడు బ్రేక్ టైం లో మైకు సెట్టు పక్కనే కూర్చొని ఒక రెండు గంటలపాటుగా ఔత్సాహికులైన యువకులు సినిమా పాటలు పాడేవారు. నేను, మా కజిన్ లు (విన్నకోట శ్రీను, విన్నకోట రమేష్) పాడే అవకాశంకోసం ఆతృతగా కాచుకొని కూర్చొనేవాళ్ళం (పిల్లలం కావడం వల్ల మావంతుకోసం వెయిట్ చేసే వాళ్ళం).

వేసవి సెలవుల్లో నూతలపాడు / చింతగుంటపాలెం లో వాలీబాల్ పోటీలను నిర్వహించేవారు. ప్రకాశం / గుంటూరు జిల్లాలలోని చాలా ప్రదేశాలనుండి టీంస్ వచ్చేవి. నేను మొట్టమొదటిసారిగా వాలీబాల్ ఆట (అప్పటికి క్రికెట్ మాగ్రామంలోకి అడుగుపెట్టలేదు) చింతగుంటపాలెం లోనే నేర్చుకున్నాను. బయట పడ్డ వాలీబాల్ ను కోర్ట్ లోకి అందించడంతో (apprentice-ship) నా వాలీబాల్ ఆట మొదలయ్యింది. అలా కొన్నాళ్ళు బాగా వాలీబాల్‌ను అందించి, కోర్ట్ లో ఆడే ప్రముఖుల మన్ననలు పొందిన తరువాత గాని పిల్లలకు కోర్ట్ లోపల ఆడే అవకాశం వచ్చేదికాదు. వెంకటరెడ్డి (తరువాత పోలీసు అయ్యాడు), బషీరు, కుర్రి పోలిరెడ్డి (మా క్లాస్మేట్) మా రెండు ఊళ్ళలోని వాలీబాల్ రాక్ స్టార్స్. నేను చిన్నప్పుడు బక్కగా ఉన్నా కబడ్డీ బాగా ఆడేవాణ్ణి. అయ్యపురెడ్డి, మా కజిన్ చిమట చిన్న శ్రీను (రెండు ఊళ్ళ మీద మొత్తం ఒక ఇరవై మంది చిమట శ్రీనులు వుండేవారు), చందనాల శ్రీను, విన్నకోట చిన్నబ్బాయి, బ్రాహ్మల హరి మొదలగువారు స్టార్ కబడ్డీ ప్లేయర్స్‌గా ఉండేవారు. ఇంకా కొన్ని పండగలరోజున ఉయ్యాల పందాలు కూడా పెట్టేవారు. చుండోళ్ళ బుడ్డాడు ఉయ్యాల మీద చేసే విన్యాసాలు నాకు ఇంకా స్పష్టంగా గుర్తున్నాయి.

చింతగుంటపాలెంలో నాకు చందమామ లాంటి పుస్తకాలు తెలుగుభాష పై నాకున్న అపారమైన అభిమానానికి బీజం వేస్తే, నూతలపాడులోని రెడ్డిపాలెం లైబ్రేరీ నాకు యండమూరి నవలలు, సినిమా వార పత్రికలు (సితార, జ్యోతిచిత్ర, విజయచిత్ర వగైరా), జానపద నవలలు,

తెలుగు/ఇంగ్లీషు డైలీలను పరిచయం చేసింది. నాలోని ఒక్కో అభిరుచికి తగ్గట్టుగా నాకు కొంతమంది స్నేహితులుగా అయ్యేవారు. ఉదాహరణకు, జానపద, డిటెక్టివ్ నవలల్లో సూరే శ్రీను; యండమూరి, మధుబాబు నవలల్లో మా కజిన్ ముంగెర రమేషు; సినిమా పత్రికల్లో మా కజిన్ విన్నకోట శ్రీను.. వీరందరూ కాక నా జీవితంలో 25 యేళ్ళదాక ప్రతి విషయంలో నాకు తోడుగా వుంటూ వచ్చిన నా ప్రాణ స్నేహితుడు మా కజిన్ విన్నకోట రవి. మేమిద్దరం ఒకే సైకిల్ మీద దాదాపు మూడు సంవత్సరాలు కలిసి హైస్కూలుకి, సినిమాలకి వెళ్ళేవాళ్ళం. సైకిలు అంటే గుర్తొచ్చింది... నేను మొట్టమొదటిసారిగా చేతులొదిలేసి సైకిలు తొక్కటం జక్కిరెడ్డి నాగిరెడ్డి (ఇప్పుడు గుంటూరులో ఎస్సై గా చేస్తున్నాడు) ని చూసి నేర్చుకొన్నాను.

ఇంకా, ఎంతో ముఖ్యమైన స్కూలు రోజులను తలచుకుంటే ముందుగా గుర్తుకొచ్చేది.. క్లాసురూముల్లో నేను పాడిన పాటలు. 6,7 తగరతుల్లో మొట్టమొదటిసారిగా రహంతుల్లా గారు (సైన్సు మాస్టారు) వారానికొక్కసారి ఒక క్లాసుని వినోదానికి కేటాయించి మాచేత సినిమా పాటలు పాడించేవారు. నేను, మా కజిన్ గ్రంధి లక్ష్మి పోటాపోటీగా పాటలు పాడేవాళ్ళం. తరువాత పూసపాడు హైస్కూల్లో శేషగిరిరావు, రాఘవేంద్రరావు మాస్టార్లు పాటలు పాడించడంలో నన్ను బాగా ప్రోత్సహించారు. బహుశా ఇలా పాడటం వల్లనే బాలు పాట మీద మమకారం నాతో పాటుగా పెరుగుతూ వచ్చింది.

6,7 తరగతుల్లో ఉన్నప్పుడు ఆగస్ట్ 15న మిడిల్ స్కూల్ లో ప్రార్ధనా గీతాలు పాడి, ఊరంతా పెరేడ్ చేసేవాళ్ళం. హైస్కూల్ రోజులను తలచుకొంటే ముందుగా గుర్తుకొచ్చేది మా గురువుగారు కామరాజు సుబ్రహ్మణ్యం గారు. ఆయన నన్ను మ్యాత్స్ లోను, ఇంగ్లీషు గ్రామరులోనూ బాగా ప్రోత్సహించి, నేను 10వతరగతిలో పర్చూరు తాలూకా first రావడానికి ముఖ్య కారకులు అయ్యారు. వారు చేసిన విద్యాబోధనకు నేను ఆజన్మాంతం కృతజ్ఞుడనై ఉంటాను. హైస్కూలు హెడ్ మాస్టారు గండు సుబ్బారావుగారు కూడా నా మీద బాగా వాత్సల్యం చూపించేవారు. ఇంకా తెలుగు మాస్టార్లు (కామరాజు నరసింహారావు, నారాయణమూర్తి, బెల్లం రాఘవేంద్రరావు గార్లు) తమ చక్కని తెలుగుభాషా బోధనా శైలితో నాలో తెలుగుభాష పట్ల బాగా ఆసక్తి రేకెత్తించారు.

అలాగే మన్యం వెంకటేశ్వరరావు, శివాలశెట్టి రామకోటేశ్వరరావు గార్లు సోషల్ స్టడీస్ లో, జెనరల్ నాలెడ్జి




లో నాకు ఉత్సుకత కలిగించారు. నా విద్యాభివృద్ధికై ఎంతో తోడ్పడ్డ నా ఎలిమెంటరీ, మిడిల్, హైస్కూళ్ళ టీచర్లందరి గౌరవార్ధం నేను చదివిన మూడు ఊళ్ళ స్కూళ్ళలో గత ఆరు సంవత్సరాలుగా annual scholorships ఇప్పిస్తూ ఆత్మసంతృప్తిని పొందుతున్నాను.

మా ఊరి నించి విదేశాలకు వచ్చిన మొదటి విద్యాధికుడు మా బాబాయి డా. చిమట గాంధీ (two-time gold medalist..one from REC Warangal in 1972 and another from IT BHU in 1975; then a Ph.D degree from Cambridge University UK in 1978). మా ఊరు పేరు వినగానే చుట్టుపక్కల ఊళ్ళవారికి మా బాబాయి గుర్తుకు వస్తారు. అంతేకాక idlebrain.com తో Jeevi గా ప్రాచుర్యం పొందిన మా మేనత్తగారబ్బాయి, గనిపిశెట్టి వెంకట (GV) రమణ వాళ్ళ రూట్స్ కూడా మా

నూతలపాడు నుండే ఇటీవల కాలంలో నాకు తెలిసిన పిల్లలు (మా కజిన్ వాళ్ళ అబ్బాయిలు, చిమట వెంకటరావు, చిమట లక్ష్మణ్; మా కజిన్, చిమట శ్రీను) IIT's ( Kanpur, Delhi and Mumbai) లో చదివారని తెలిసి నాకు చాలా సంతోషం వేసింది.

మన వ్యక్తిత్వం రూపు దిద్దుకోవడంలో మన తల్లితండ్రుల పాత్ర ఎంత ఉంటుందో అంతే పాత్ర మనం పెరిగిన ఊరు కూడా వహిస్తుందని నా నమ్మకం. ఎంతో అందమైన బాల్యాన్ని అందించి మంచి అభిరుచులను పెంపొందించుకోవడంలో నాకు సాయం చేసిన మా ఊరికి, అక్కడ ఉన్నవారికి ఏదో ఒకటి చేయాలని గట్టి కోరిక. సమీప భవిష్యత్తులో మాఊళ్ళో మా నాయనమ్మ-తాతయ్య పేర్లమీద ఒక హైస్కూలు కట్టించాలని, శిధిలావస్తలో ఉన్న రెడ్డిపాలెం లైబ్రెరీకి కూడా ఏదన్నా ధనసహాయం చేయ్యాలనే అలోచనతో ఉన్నాను.

చిమట శ్రీనివాసరావు REC Jaipur లో ఇంజినీరింగ్, IT Kanpur లో M.Tech, California State University Chicoలో MS చేసి, ప్రస్తుతం సిలికాన్ వ్యాలీలోని Ebay కంపెనీలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతోద్యోగం చేస్తున్నారు. తన జీవితంలో అత్యంత ఇష్టమైన రెండు విషయాలు: తన ఇద్దరి పాపలతో ఆడే ఆటలు, SP Balu పాడిన తెలుగు పాటలు. తెలుగు పాటల మీద తనకున్న అనంతమైన మమకారంతో ChimataMusic.com అనే ఒక అద్భుతమైన Music సైట్ ని నడుపుతున్నారు.

He can be reached at schimata@gmail.com.



మాఊరి జ్ఞాపకాలను ఈ వ్యాసం ద్వారా నెమరువేసుకోవడనికి నాకు అవకాశం ఇచ్చిన కిరణ్‌ప్రభగారికి నా కృతజ్ఞతలు తెలియ చేసుకొంటున్నాను. ఈ వ్యాసం చదివిన తరువాత కొంతమంది (ముఖ్యంగా గుంటూరు / ప్రకాశం జిల్లాలలోని గ్రామీణ నేపధ్యం నుండి వచ్చినవారు) తమ బాల్య స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటారని ఆశిస్తున్నాను.

